నో స్టాప్... ప్రయాణాలకు బ్రేక్

తగరపువలస ప్రాంత ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



బైపాస్ మీదుగా వెళ్లిపోతున్న ఆర్టీసీ బస్సు



తగరపువలస వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో అత్యంత కీలకమైన తగరపువలస వాసులకు ఆర్టీసీ బస్సులు అందకుండానే బైపాస్ మీదుగా తుర్రుమంటున్నాయి. ఇదే జాతీయ రహదారిపై ఉన్న మధురవాడ, బోయిపాలెం, ఆనందపురం, మారికవలస, పరదేశిపాలెం, పీఎం పాలెం, కొమ్మాది, ఎండాడ వంటి ప్రాంతాల ప్రయాణికులకు అందుబాటులో ఉండి తగరపువలస గ్రామాన్ని మాత్రం అంటీముట్టనట్టుగా ఫ్లై ఓవర్ల మీదుగా వెళ్లిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రయాణికులు తగరపువలసకు దూరంగా ఉండే సంగివలస, వెంకటేశ్వరమెట్ట వద్ద వసతులు లేనిచోట బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. ఇక్కడ ఫ్లై ఓవర్లు నిర్మించిన కారణంగా వందలాది వ్యాపారాలు సైతం మూతపడగా బస్సులు కూడా దూరమయ్యాయి. వాస్తవానికి నియోజకవర్గానికి కేంద్రమైన భీమిలి పట్టణానికి చేరుకోవాలంటే తగరపువలస మీదుగానే ఎవరైనా రావాల్సి ఉంటుంది. కానీ ఆనందపురం నుంచి విజయనగరం జిల్లాలోని రాజాపులోవ వరకు ఎక్కడా జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి మార్గాలు లేకపోవడంతో తగరపువలస చేరుకోవడానికి ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు సిటీ సర్వీస్‌లు సైతం తగరపువలస కూడలికి రాకుండానే వెళ్లిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఆటోలు, వ్యాన్‌లను ఆశ్రయిస్తున్నారు.

బస్ స్టేజ్‌ల విషయంలోనూ వివక్షే..

విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ బస్సులలో చాలా వరకు తగరపువలసలో స్టేజ్ ఉండడం లేదు. ఈ మూడు జిల్లాల్లో ప్రధాన ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో బస్సులు ఎక్కాలంటేనే ప్రయాణికులు భయపడిపోతున్నారు. బస్సు ఎక్కేటప్పుడే తగరపువలస పేరు చెబితే స్టేజ్ లేదంటూ బలవంతంగా దించేస్తున్నారు. ఆయా జిల్లాల్లో మధురవాడ, ఆనందపురం, భోగాపురం, పూసపాటిరేగ, రణస్థలం, మానాపురం, రాజాం, గజపతినగరం, బొబ్బిలి, సాలూరు వంటి ప్రాంతాలకు స్టేజ్‌లు కేటాయించి తగరపువలసను మాత్రం విస్మరిస్తున్నారు. తగరపువలస కేంద్రంగా పదుల సంఖ్యలో విద్యాసంస్థలు, ఫార్మసీ, మెడికల్, డెంటల్ కళాశాలలతో పాటు ఆరు మండలాలకు కేంద్ర బిందువుగా ఉంది. అలాంటి తగరపువలస బైపాస్ మీదుగా కాకుండా కూడలి నుంచి బస్సులు నడుపుతూ అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లకు కూడా ఇక్కడ స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పేదలకు వరం 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా నిలిచిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మద్ది, బాందేవుపురం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన 'జగనన్న సురక్ష' గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. పేదలు ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వెంటనే అందజేస్తున్నట్టు తెలిపారు. పేదల సంక్షేమం, ప్రజల శ్రేయస్సు కోసం పని చేసే వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి అన్నారు. వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థను తమిళనాడులో ప్రవేశపెట్టేందుకు సీఎం స్టాలిన్ సిద్ధమవుతున్నారన్నారు. మద్ది గ్రామస్తులకు సంక్షేమ పథకాల రూపంలో ఈ నాలుగేళ్లలో రూ.27 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, బుగత సత్యానారాయణ, ఎంపీడీవో ఎం.వి జయ్ కుమార్, నాయకులు సుంకర బంగారప్పడు, మామిడి శివరామకృష్ణ, బుగత ఎర్నాయుడు, తాలాడ పద్మనాభం, వాజిగాని పైడినాయుడు, బోని సన్యాసినాయుడు, మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఈడీ డిప్యూటీ డైరెక్టర్



కుటుంబ సభ్యులతో ప్రభాకర్

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్ మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి అంతరాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సూపరింటెండెంట్ ఎ.వెంకటరమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకృష్ణ ప్రసాదం అందజేశారు.

మీనామృతం పిచికారీతో అధిక దిగుబడి

పద్మనాభం: మీనామృతం పిచికారీ చేయడం వల్ల పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి జయరామ్ అన్నారు. మండలంలోని కోరాడలో మహిళా రైతులకు మీనామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ చేపల వ్యర్థాలకు సమానంగా బెల్లాన్ని తీసుకుని డ్రమ్ములో పొరల పొరలగా వేయాలని సూచించారు. ఈ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం వేళల్లో కలపాలన్నారు. ఈ విధంగా కలిపిన మిశ్రమం 40 రోజుల తర్వాత మీనామృతంగా తయరవుతుందన్నారు. రెండు లీటర్ల మీనామృతాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరం విస్తీర్ణంలో పంటకు పిచికారీ చేయాలని సూచించారు. ఎన్‌ఎఫ్‌ఏలు వనజ, చక్రవర్తి, అప్పలనాయుడు, ఐసీఆర్‌సీ కాంతారావు పాల్గొన్నారు.

రోడ్డుపై పార్కింగ్‌తో ఇక్కట్లు



రుషికొండ వద్ద రోడ్డుకి ఇరువైపులా నిలిపిన వాహనాలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌కు చేరుకోవాలంటే పర్యాటకులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధాన రహదారి నుంచి బీచ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా షాపులు ఉండడం మరింత ఇబ్బందిగా మారుతోంది. రోజూ వందలాది మంది పర్యాటకులు రుషికొండ బీచ్‌ను సందర్శిస్తుంటారు. వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. ఇలాంటి తరుణంలో రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో బీచ్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాతపేటలో వసతులు లేక అవస్థలు



డ్రైనేజీలు, సీసీరోడ్లు లేని తాళ్లవలస పంచాయతీలోని యాతపేట

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేటలో పూర్తిగా డ్రైనేజీలు, సీసీ రోడ్ల సౌకర్యం లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడ నిర్మించిన పెద్ద డ్రైను తప్ప అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో వర్షం కురిస్తే ఇళ్ల మధ్య చెరువులను తలపిస్తున్న గోతులు కనిపిస్తున్నాయి. తిరుమల కళాశాల – కుమ్మరిపాలెం రహదారిని ఆనుకుని లే అవుట్ వరకు ఉన్న ఈ యాతపేటలో పూర్తిగా డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే ఈ గ్రామానికి సామాజిక భవనం, ఇంటింటా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం ఎంపీడీవో అడపా లవరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రోడ్లు, కాలువులు, విద్యుత్, తాగునీరు ఉండాలన్నది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే జాగ్రత్తులు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ లబ్ధిదారులు ఇళ్లు అడుగుతున్న దృష్ట్యా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి అర్హులను గుర్తించి స్థలాలు సిద్ధం చేయాలని చెప్పారు. మండలంలోని ఇనాం గ్రామాలైన బోని, ముచ్చర్లలోని భూములు సాగు చేస్తున్న రైతులకు హక్కులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పశు వైద్యాధికారి లీలా రాణి మాట్లాడుతూ 185 ఆవులకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేశామన్నారు. విద్యుత్ శాఖ ఏఈఈ సురేష్ కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఉచితంగా విద్యుదీకరణ పనులు చేస్తున్నామని చెప్పారు. లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇప్పటి వరకూ 51 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, ఉపాధి హామీ పథకం సాంకేతిక సలహాదారు తిరుమల రావు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పాండ్రింకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి మండేలా కృషి

తగరపువలస: వర్ణ వివక్షకు వ్యతిరేకంగా, ప్రపంచ శాంతి కోసం నెల్సన్ మండేలా కృషి చేశారని జీవీఎంసీ ఒకటో వార్డు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు అన్నారు. మంగళవారం మండేలా జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. దక్షిణాఫ్రికాకు మాజీ అధ్యక్షుడైన మండేలా ఆ దేశానికి పూర్తిస్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడన్నారు. ఆయన జయంతిని నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవంగా 2009 నవంబరులో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఆమోదించాయన్నారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని రెండు పంచాయతీల్లో బుధవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. రామవరం సచివాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు, శొంఠ్యాం సచివాలయం వద్ద 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారని తెలిపారు.

కోచ్ చరణ్‌కు గురుబ్రహ్మ అవార్డు



చరణ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మధురవాడ: ఎన్‌ఐఎస్ కోచ్ ఇనగంటి చరణ్‌ను గురుబ్రహ్మ అవార్డు వరించింది. సర్వేజనా సుఖినోభవంతు జాతీయ స్థాయి సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్ర కుమార్, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణ శేషు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు ఎస్‌పీ భారతి, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు మందడి కృష్ణారెడ్డి తదితరుల చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. అవార్డుతో పాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందుకున్నాడు. మధురవాడకు చెందిన చరణ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బెంగళూరులో అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్, యోగా క్రీడల్లో శిక్షణ పూర్తి చేశాడు. 18 సార్లు రాష్ట్ర స్థాయి, 3 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఎంతో మంది క్రీడాకారులను సాఫ్ట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా, ఫెన్సింగ్ బాల్, బేస్ బాల్ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాడు. అలాగే తెలంగాణలో అనాథ బాలబాలికలకు ఉచితంగా క్రీడల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాడు. ఈ సేవలు, ప్రతిభకు గుర్తింపుగా అవార్డు లభించిందని చరణ్ తెలిపారు.

తారు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి



కొండ నుంచి జారుకుని వచ్చి తారురోడ్డుపై ప్రమాదకరంగా పేరుకుపోయిన మట్టి

- వర్షం కురిస్తే బురదగా మారుతున్న వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు

ఆనందపురం : స్థానిక పూల మార్కెట్ నుంచి ఆనందపురం వెళ్లే మార్గంలో జగనన్న కాలనీ వద్ద రోడ్డుపైకి కొండ నుంచి కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక పేరుకుపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు అదుపు తప్పి పడిపోవడంతో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుకు ఆనుకొని ఉన్న జట్లమ్మ కొండపై జగనన్న కాలనీ ఇళ్లు నిర్మిస్తున్నారు. ఆ కాలనీ వాసుల సౌకర్యార్థం కొండపైనుంచి కింద ఉన్న తారురోడ్డు వరకూ 30 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. కాగా కొండ ప్రాంతం చాలా ఏటవాలుగా ఉండడంతో పైనుంచి వరద నీరు రోడ్డు గుండా నేరుగా తారురోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీని కారణంగా వరదతో మట్టి కొట్టుకొచ్చి రోడ్డుపై పేరుకుపోతోంది. అలాగే ఇంటి నిర్మాణదారులు నిల్వ చేసుకున్న ఇసుక కూడా రోడ్డుపైకే కొట్టుకొచ్చేస్తోంది. దీంతో ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డంతా బురదగా మారుతోంది. దీనివల్ల ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. వారం రోజుల వ్యవధిలో ఆరు ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారు. ముఖ్యంగా రాత్రి వేళ ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపైకి మట్టి కొట్టుకురాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తీరానికే పరిమితం



ఉప్పాడ తీరం వద్ద ఉంచిన వలలు



వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

కొమ్మాది: సముద్రంలో ప్రతికూల పరిస్థితులతో తీర ప్రాంతాల్లో చేపల వేట నిలిచిపోయింది. గత నాలుగు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు, వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో తీరం అల్లకల్లోలంగా మారింది. దీంతో మత్స్యకారుల చేపల వేట నిలిచిపోయింది. ప్రస్తుతం వారంతా తీరంలో వలలు, పడవలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకున్నారు. వలలు అల్లుకుంటూ, పడవల మరమ్మతులు చేసుకుంటున్నారు.

నాలుగు రోజుల నుంచి వేట లేకపోవడంతో జీవనోపాధి కష్టంగా మారిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా హైమాక్స్ లైట్లు



స్తంభంపై వేలాడుతున్న లైట్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ కూడలి వద్ద ఉన్న హైమాక్స్ లైట్లు ప్రమాదకర పరిస్థితుల్లో వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభానికి మూడు లైట్లు జారిపడి ఒక్క వైర్‌పైన ఆధారపడి ఉన్నాయి. ఈదురు గాలులు వీస్తే పడిపోయే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతానికి మొత్తం ఇది కూడలి కావడం... దీనికి సమీపంలో బస్టాప్ ఉండడంతో నిత్యం వందలాది మంది ఇక్కడ ఉంటారు. ఏ క్షణమైనా ప్రమాదం జరగవచ్చు. అధికారులు తక్షణమే స్పందించి ఈ లైట్లను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుంచి కాపులుప్పాడ వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం నగరపాలెం సచివాలయం వద్ద జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఏసీపీ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 40 అడుగుల వరకు రోడ్డు విస్తరిస్తారని... ఈ క్రమంలో ఏయే ఆస్తులు ప్రభావితమవుతాయో గుర్తిస్తారన్నారు. టీడీఆర్‌కు డిమాండ్ చేయకుండా ప్రతిపాదిత రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. అయితే కాంపౌండ్ వాల్స్, చిన్న చిన్న నిర్మాణాల్లో కొంత భాగం రోడ్డు విస్తరణకు తొలగించే అవకాశం ఉన్నందున, వాటిని ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది వెనువెంటనే పునరుద్ధరించాలని స్థానికులు అధికారులను అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శివశక్తినగర్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థి తల్లికి సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అవినీతి లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు 71వ నంబరు సచివాలయం పరిధి శివశక్తినగర్, శ్రీలక్ష్మినగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీల్లో ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కడ చూసినా మహిళా వలంటీర్లే ఎక్కువగా ఉంటున్నారన్నారు. ఈ సచివాలయంలో 18 మంది వలంటీర్లలో 13 మంది మహిళలే అన్నారు. అన్ని రకాల ఉద్యోగాలు, పదవులు, పథకాలు మహిళలకే జగన్‌మోహన్ రెడ్డి అధికంగా ఇస్తున్నారన్నారు. ఇది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ దవళ ఉత్తర మాట్లాడుతూ తమ కుటుంబానికి రూ.7,39,842 మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు స్థానిక సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల మధురవాడ హైవేలో రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురైన చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నాయకులు బగాది. లక్ష్మణ, పెంట్ర అప్పన్న, ఎస్.బాబ్జి, బండారు శివలక్ష్మి, అప్పారావు, జ్యోతిష్, ఒమ్మి వెంకటరమణ, చింతాడ శ్రీనివాసరావు, శ్రీదేవి, ఏఈలు ఎస్‌వీఎస్ రామమూర్తి, అన్నంనాయుడు పాల్గొన్నారు.

త్వరలో మంచినీటి సరఫరాకు చర్యలు



మంగమారిపేటలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో త్వరలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మంగళవారం ఆయన ఈ ప్రాంతంలో పర్యటించారు. ఇటీవల ఈ ప్రాంతంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి ఇక్కడి మంచినీటి సమస్యను స్థానికులు తీసుకొచ్చారని, ఈ ప్రాంతంలో ఎక్కడ బోరు తవ్వినా ఉప్పు నీరు పడుతుందని స్థానికులు తెలిపారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎక్కడి నుంచి ఈ ప్రాంతానికి మంచినీరు అందించగలమో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా డ్రైనేజీల పైకప్పులు శిథిలావస్థకు చేరుకోవడంతో చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పబ్లిక్ డిమాండ్

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు



పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద వెలగని వీధిదీపాలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యమైన ఈ కూడలికి ఒకవైపు బక్కన్నపాలెం, మరొకవైపు బాబా కళాశాల ఉన్నాయి. ప్రతి బుధవారం ఇక్కడ సంత నిర్వహిస్తుంటారు. కూడలిలో దుకాణాలు ఉన్నప్పుడు వాటి నుంచి వెలుతురు మాత్రమే ఇక్కడ కనిపిస్తుంది. దుకాణాలు మూసివేసిన తర్వాత ఇక్కడ అంధకారంగా ఉంటుంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే ఈ చివరి బస్టాప్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. – ఎం.జగన్నాథరావు, పీఎం పాలెం, ఆఖరి బస్టాప్